క్లుప్తంగా

ప్రజాగర్జన సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న గన్న చంద్రశేఖర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కొత్తగూడెంలో ఈనెల 11న నిర్వహించే సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్న చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 14 నుంచి ఇంటింటికీ సీపీఐ- ప్రజా చైతన్య పాదయాత్ర నిర్వహిస్తామని, దీనికి ముగింపుగా జూన్ 11న బహిరంగ సభ చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా నుంచి భారీగా జన సమీకరణ చేయాలన్నారు. సమావేశంలో యల్లావుల రాములు, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు, ఎల్లంల యాదగిరి, మండవ వెంకటేశ్వర్లు, ఎల్లావుల రమేష్ తదితరులు పాల్గొన్నారు

బహిరంగ సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి): కొత్తగూడెంలో జూన్ 11న జరిగే ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్లంల యాదగిరి కోరారు. గురువారం ప్రజాగర్జన వాల్‌పోస్టర్లను తిరుమలగిరి మండలంలోని తొండ గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సింగరేణి ప్రైవేటీకరణ, బయ్యారం ఉక్కు కర్మాగారం, గిరిజన విశ్వ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే, విమాన, రక్షణ రంగాలను ప్రైవేటీకరణ చేయొద్దన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీకాంత్, ఎండీ ఎక్బాల్, మల్లయ్య, సత్తయ్య, అశోక్, ఉప్పలయ్య, ఫయాజ్ పాల్గొన్నారు.

బాలికలపై వివక్ష వీడాలి

తిరుమలగిరి (తుంగతుర్తి): బాలికలపై వివక్ష వీడాలని తాటిపాముల గ్రామ సర్పంచ్ ఎర్ర శోభ అన్నారు. గురువారం తిరుమలగిరి మండలంలోని తాటిపాముల గ్రామంలో మార్పు సొసైటీ ఆధ్వర్యంలో లింగ వివక్షత, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోరెళ్ల విక్రమ్‌కుమార్, ఏఎన్ఎం సంధ్య, పుష్పలత, అనిత, శోభారాణి, స్వప్న, సునీత పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

నాగారం: మండల పరిధిలోని పసునూర్ గ్రామంలో శ్రీ భ్రమరాంబిక- మల్లికార్జున స్వామి విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గురువారం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు స్వామివారికి జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేర్పుల సాలయ్య, ఆలయ కమిటీ చైర్మన్ పాదిల రమేష్‌గౌడ్, వైస్ చైర్మన్ బిక్కి శ్రీను, గుండు శ్రీను, ఉత్సవ కమిటీ సభ్యులు నల్లగంటి మల్లయ్య, చిత్తలూరి వెంకన్న పాల్గొన్నారు.

మద్దతు ధర పెంపుపై హర్షం

అర్వపల్లి: రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచడం పట్ల బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ప్రధాని మోదీ ఫసల్ బీమా యోజన, కిసాన్ సమ్మాన్ నిధి పథకాల ద్వారా పేద రైతులను ఆదుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల భారతీయ యువమోర్చా అధ్యక్షుడు జిన్నె అశ్విన్, వేముల సత్తయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్

నాగారం: మండల పరిధిలోని పేరబోయినగూడెం గ్రామానికి చెందిన దాసరి సందీప్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక సర్పంచ్ తీగుళ్ల స్వరూప ప్రశాంత్ గురువారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేల ఆర్థికసాయం చేశారు. ఆమె వెంట దాసరి రమేష్, దాసరి వెంకన్న, పేరబోయిన వీరయ్య, కాసబోయిన భిక్షం, దాసరి వీరేష్, చాగంటి శ్రీను, ఉప్పుల జానకీ-రామ్ తదితరులున్నారు.

అనారోగ్యంతో ఇబ్బందిపడుతుండడంతో..

అర్వపల్లి: మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన ఆరాధ్య ఫౌండేషన్ సభ్యుడు గుంటోజు నాగేంద్రచారి తల్లి అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజు గురువారం వారికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ మాజీ చైర్మన్ సైదులు, ఆచారి పాల్గొన్నారు.

ఊరూరా చెరువుల పండుగ



పిల్లలమర్రిలోని సుబ్బ సముద్రం చెరువు కట్టపై ఏర్పాటు చేసిన చెరువు పండుగకు హాజరైన ప్రజలు



సుబ్బ సముద్రం చెరువులో పూలు చల్లుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

తుంగతుర్తి: మండల పరిధిలోని తూర్పుగూడెం గ్రామంలో నిర్వహించిన చెరువుల పండుగలో జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగేంధర్‌రావు పాల్గొన్నారు. బోనాలు, బతుకమ్మలతో గ్రామస్తులతో కలసి ర్యాలీగా వెళ్లి కట్టమైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారికి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుజ్జ పూలమ్మ, నల్లు రామచంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, తాటికొండ సీతయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చివ్వెంల(సూర్యాపేట) : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గురువారం ఊరూరా చెరువుల పండుగ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహిళలు బతుకమ్మలను పేర్చి ఊరేగింపుగా తీసుకువెళ్లి చెరువుల్లో నిమజ్జనం చేశారు.

తిరుమలగిరి (తుంగతుర్తి): చెరువుల పండుగ సందర్భంగా తిరుమలగిరి మున్సిపాలిటీతోపాటు, మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. బోనాలు, కోలాటం, డప్పుచప్పుళ్లతో గ్రామస్తులు ఊరేగింపుగా చెరువుల వద్దకు వెళ్లి బతుకమ్మ ఆడారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజని, మున్సిపల్ వైస్ చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, తహసీల్దార్ రమణారెడ్డి, కమిషనర్ దండు శ్రీనివాస్, తాటిపాముల గ్రామంలో సర్పంచ్ శోభాశ్రీనివాస్, ఎంపీటీసీ ప్రవీణ్, తొండ గ్రామంలో సర్పంచ్ ఎస్.శాతవాహనరావు పాల్గొన్నారు.

అర్వపల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అన్ని గ్రామాల్లో చెరువుల పండుగ నిర్వహించారు. కుంచమర్తిలో ఎంపీపీ మన్నె రేణుక, సర్పంచ్ ఉగ్గం ఉపేంద్రలింగరాజు, అర్వపల్లిలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, సర్పంచ్ సునీతరామలింగయ్య, ఎంపీటీసీ పద్మశ్రీనివాస్, తిమ్మాపురంలో వైస్‌ఎంపీపీ మారిపెద్ది భవాని ఉత్సవాలకు హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ యాదగిరిరెడ్డి, ఎంపీడీఓ ఉమేష్, ఎంపీఓ ఉపేందర్‌రావ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాగారం: చెరువుల పండగ సందర్భంగా నాగారం మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం మహిళలు బోనాలు, బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామాల్లోని కట్టమైసమ్మ ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కూరం మణివెంకన్న, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఎంపీడీఓ జి.శోభారాణి, పీఆర్ డీఈఈ కొండయ్య, ఇరిగేషన్ డీఈఈ పిచ్చయ్య, సుపరిండెంట్ ముత్తయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మద్దిరాల: సీఎం కేసీఆర్ పుణ్యమా అని వేసవిలో సైతం చెరువులు జలకళను సంతరించుకున్నాయని, బీడు భూములు సాగులోకి వచ్చాయని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం మద్దిరాల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఊరూరా చెరువుల పండుగ నిర్వహించారు. కుంటపల్లిలో జరిగిన కార్యక్రమానికి మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ రాజేష్, పంచాయతీ కార్యదర్శి లలిత, గానుగబండ సర్పంచ్ నల్లు రామచంద్రారెడ్డి, గోల్కొండ మల్లేష్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

నూతనకల్: కాళేశ్వరం జలాలతో చెరువులకు జలకళ సంతరించుకుందని ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చెరువు పండుగ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: సీఎం కేసీఆర్ చెరువులకు పూర్వ వైభవం తీసుకువచ్చారని జెడ్పీటీసీ మామిడి అనిత అన్నారు. గురువారం పెన్‌పహాడ్ మండల పరిధిలోని అనంతారం గ్రామం ఆవుల చెరువు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు రేవతి, నాగార్జున, వెంకన్న, సతీష్ పాల్గొన్నారు.

కాళేశ్వరం జలాలతో రాయి చెరువుకు జలసిరి

- మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

పెన్‌పహాడ్: కాళేశ్వరం జలాలతో రాయి చెరువులో జలసిరి శోభ సంతరించుకుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఊరూరా చెరువుల పండుగలో భాగంగా గురువారం రాత్రి పెన్‌పహాడ్ మండల పరిధిలోని మాచారం గ్రామం రాయి చెరువు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు మంత్రికి మహిళలు కోలాటం, బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం చెరువు వద్ద భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్య, సర్పంచ్ బొల్లక సైదమ్మబొబ్బయ్య, నీటి పారుదల సీఈ రమేష్‌బాబు, ఈఈ భద్రు నాయక్, డీఈ రమేష్, మండల ప్రత్యేక అధికారి రాంపతి, తహసీల్దార్ శేషగిరిరావు, ఏఓ బి. కృష్ణసందీప్, మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్, ఎంపీఓ నరేష్, ఆర్ఐ మట్టయ్య, అనిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



పెన్‌పహాడ్: అనంతారంలో చెరువు వద్ద..



తుంగతుర్తి: తూర్పుగూడెంలో బతుకమ్మలతో..



అర్వపల్లి: కుంచమర్తి గ్రామంలో..



నాగారం : డి.కొత్తపల్లిలో బతుకమ్మలు, బోనాలతో మహిళలు



తిరుమలగిరిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మద్దిరాల : కుంటపల్లిలో బతుకమ్మలతో ర్యాలీగా వెళ్తున్న గ్రామస్తులు



నూతనకల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



గుడిబండ తండాలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

పెన్‌పహాడ్: మండల పరిధిలోని మాచారం ఆవాసం గుడిబండ తండాలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు బోనాలతో ర్యాలీగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లక సైదమ్మబొబ్బయ్య, ఎంపీటీసీ నాగునాయక్, ఉప సర్పంచ్ నాగయ్య, జిల్లా నాయకులు కొప్పుల వేణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, అడ్డి కేశవులు, శివనాయక్, దుబ్లానాయక్, అనిరెడ్డి వెంకట్‌రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, భూక్య నరేందర్, చిత్తరంజన్, రాము, జగన్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజాధనం వృథా

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): దశాబ్ది ఉత్సవాల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ ప్రగతి సాధించిందని ఉత్సవాలు జరుపుతుందో ప్రజలకు వివరించాలన్నారు. రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని రూ.5లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టినందుకా అని ప్రశ్నించారు. ప్రతినెలా సక్రమంగా పెన్షన్లు, జీతాలు ఇవ్వలేనందుకా..? నిరుద్యోగం పెరిగినందుకా అని అన్నారు. ప్రజల సొమ్ముతో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం చేయించుకుంటుందన్నారు. ఉపాధి హామీ కూలీలను, గ్రామాల్లో ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను తీసుకువచ్చి వండర్ రికార్డుల పేరుతో ప్రచారం చేసుకోవడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. సూర్యాపేట మున్సిపాలిటీ నిధులను విచ్చలవిడిగా దోచుకుంటున్నారని విమర్శించారు. అనంతరం పార్టీలో చేరిన పలువురికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ షఫీఉల్లా, గట్టు శ్రీనివాస్, స్వామినాయుడు, గోదల రంగారెడ్డి, వల్దాసు దేవేందర్, షేక్ ఫరూక్, ధర్మానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న పాల్వాయి పరుశరాములు

మద్దిరాల: మాదిగల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పాల్వాయి పరుశరాములు అన్నారు. గురువారం మద్దిరాల మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 30న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో నిర్వహించనున్న మహాధర్నాకు సంబంధించి ఈనెల 14న తుంగతుర్తి నియోజకవర్గంలో మాదిగల ఆత్మగౌరవ సభను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పటిదల రవి, అంబేద్కర్, పాల్వాయి సూరయ్య, మీసాల బాలకృష్ణ, చెంచు లక్ష్మణ్, లక్ష్మయ్య, అమర్‌నాథ్, మేఘనాథ్ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయం

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి వార్ల దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు జరగనున్నాయి. 12న ప్రతిష్ఠ కార్యక్రమం ప్రారంభం, గ్రామ తోరణం, గణపతి పూజ, ప్రతిష్ఠామూర్తుల ఊరేగింపు, సాయంత్రం అగ్ని ప్రతిష్ఠా హోమం ప్రారంభం కానుంది. 13న జలాధివాసం, ధాన్యాధివాసం, ధ్వజస్తంభానికి జలాధివాసం, దేవత మూలమంత్ర హోమాలు నిర్వహించున్నారు. 14న గణపతి పూజ, భూమి పూజ, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ జరుగుతుందని దేవాలయ కమిటీ తెలిపింది. అదే రోజు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

మేరు సంఘం మండల కమిటీ ఎన్నిక

అర్వపల్లి: అర్వపల్లిలో గురువారం మేరు సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పర్సాయపల్లికి చెందిన కీర్తి చిట్టిబాబు మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వారణాసి సత్యనారాయణ, వాడపల్లి లక్ష్మమ్మ, కీర్తి విజయ, ప్రధాన కార్యదర్శిగా కీర్తి వెంకటేశ్వర్లు, కార్యదర్శులుగా కీర్తి పాండు, కె.కమలమ్మ, వారణాసి అరుణ, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కొండ పురుషోత్తం, కీర్తి కళమ్మ, కోశాధికారిగా వారణాసి గణేష్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా సత్యనారాయణ, నరేందర్ వ్యవహరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య



అర్వపల్లి: కోడూరులో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు



నూతనకల్: ఎర్రపహాడ్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే గుణాత్మక విద్య అందుతుందని కోడూరు యూపీఎస్ ఎస్ఎంసీ చైర్మన్ తండు దశరథ, ప్రధానోపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, సాయికుమార్, రాము పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నూతనకల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ రాములు నాయక్ అన్నారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి): విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండల విద్యాధికారి శాంతయ్య కోరారు. గురువారం తిరుమలగిరి మండలంలోని జలాల్‌పురం గ్రామంలో బడి బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, దుస్తులు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, సీఆర్పీ సోమేష్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సర్పంచ్ మామిడి వెంకన్న అన్నారు. గురువారం తుంగతుర్తి మండల పరిధిలోని వెలుగుపల్లి ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు రామతార, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కల స్వైరవిహారం

- గుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి
- బయటకు వెళ్లాలంటేనే జంకుతున్న జనం
- వీటిని వేరే చోటకు తరలించాలని వేడుకోలు



అర్వపల్లిలో వీధిలో తిరుగుతున్న కుక్కలు



అర్వపల్లిలో కోతుల సంచారం

అర్వపల్లి: మండలంలో కోతులు, కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లపై గుంపులుగా తిరుగుతూ దాడులు చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం ఏదో ఒక గ్రామంలో జనం కుక్క కాటు బారిన పడుతున్నారు. బయటికి వెళ్లాలంటేనే కుక్కలు, కోతులతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. తాజాగా అర్వపల్లిలో ఒకేరోజు ఐదారుగురిని కోతులు గాయపర్చాయి. వీటిని వేరే చోటకు తరలించేవారే కరువయ్యారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలకు 85 నుంచి 100మంది వరకు బాధితులు

జాజిరెడ్డిగూడెం మండలంలో కోతులు, కుక్కల సంఖ్య గతంలో కన్నా రెట్టింపైంది. నెలకు 85 నుంచి 100 మంది వరకు వీటి బారిన పడి గాయపడుతున్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స కోసం బాధితులు క్యూ కడుతున్నారు. ఒక్కోసారి వ్యాక్సిన్‌లు కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. ఫిబ్రవరిలో మండల వ్యాప్తంగా 86 మంది వరకు వీటి బారిన పడి గాయపడ్డారు. మార్చిలో 90 మంది వరకు, ఏప్రిల్‌లో 95 మంది వరకు, మేలో 100 మందికి పైగానే కుక్కలు, కోతుల దాడిలో గాయపడ్డారు. ఇంకా అనేక మంది ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. ఇప్పటికైనా కుక్కలు, కోతుల బారి నుంచి తమను రక్షించేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కుక్క దాడిలో తీవ్రంగా గాయపడ్డా



కుక్క దాడిలో ఇటీవల తీవ్రంగా గాయపడ్డాను. అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ ఎదుట ఇంటి ముందు ఉండగా కుక్క వచ్చి మీద పడి దాడి చేసింది. చుట్టుపక్కల వారు వచ్చి నన్ను కాపాడారు. కుక్కలను వేరే చోటుకు తరలించారు.

– కనుకు భద్రయ్య, అర్వపల్లి

బాధితుల సంఖ్య పెరుగుతోంది



అర్వపల్లిలోని పీహెచ్‌సీలో పూర్తి స్థాయిలో కుక్క, కోతి కాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. వీటి కాట్లకు గురైన వారు నిర్లక్ష్యం చేయొద్దు. అర్వపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో యాంటిరేబిస్ వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నాయి. రోజురోజుకు కుక్క, కోతి కాటుకు గురవుతున్న బాధితుల సంఖ్య పెరుగుతోంది.

– డాక్టర్ మణిదీప్, వైద్యాధికారి, అర్వపల్లి

హరితహారం మొక్కలు అగ్గిపాలు



గోరెంట్ల- మద్దిరాల హైవేలో కాలిపోయిన మొక్కలు

మద్దిరాల: మద్దిరాల మండల పరిధిలోని ఎర్రపహాడ్ ఎక్స్‌రోడ్డు - మద్దిరాల వరకు గల 365 జాతీయ జాతీయ రహదారికి ఇరువైపులా హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. మూడు నెలల క్రితం నేషనల్ హైవేకు చెందిన కార్మికులు గోరెంట్ల శివారులో రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేస్తున్న క్రమంలో మొక్కలకు నిప్పు పెట్టడంతో అవి కాలిపోయాయి. అదేవిధంగా రైతులు తమ చెలకల్లో వ్యర్థాలను తగలబెట్టే క్రమంలో చెత్తకు నిప్పు పెట్టుకోగా అది రగులుకొని ఎర్రపహాడ్- పోలుమల్ల మధ్య, గోరెంట్ల- మద్దిరాల మధ్య హైవే వెంట మొక్కలు దగ్ధమయ్యాయి. అధికారులు స్పందించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటి సంరక్షణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

• మృగశిర సందడి





మృగశిర కార్తె ప్రారంభం రోజునే చేపలను తినడం ఆనవాయితీగా వస్తుంది. దీంతో గురువారం సూర్యాపేటలోని చేపల మార్కెట్, పరిసర ప్రాంతాలు రద్దీగా మారాయి. కాగా.. చేపలకు డిమాండ్ పెరగడంతో ధర భారీగా పెరిగింది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట